
# ఒంటరి నక్షత్రం

కె. వాసవదత్త రమణ



అయిదవ్వగానే హడావుడిగానే బయలుదేరాను ఆఫీసు నుంచి. ''ఆరింటికే వచ్చేసేయి! వాళ్ళు వచ్చేస్తారు'' అని అమ్మ పొద్దున చేసిన హెచ్చరిక నేను మరచిపోలేదు.

బస్టాపుకి రాగానే అప్రయత్నంగా అతనికోసం నా కళ్లు వెతికాయి. అతను ఉన్నాడు అక్కడే. నన్ను చూడగానే అతని కళ్ళలో మెరుపులు! ఒక నెల నుంచి చూస్తున్నాను అతన్ని! నాతోపాటు బస్సు ఎక్కుతాడు, నా స్టాపు రాగానే నాతోనే దిగుతాడు. మా యింటి సందువరకు వస్తాడు. నేను ఇంట్లోకి వెళ్లేవరకు చూసి వెళ్లిపోతాడు. అంతే!

అతని కళ్లలో నా పట్ల ఏదో ఇష్టం, ఆరాధన! మనిషి పెద్ద అందగాడు కాదు. తెలియని ఆకర్షణ ఉంది అతని రూపంలో.

ఇంట్లోకి వెళుతూనే వెనక్కి చూశాను. అతను అలాగే నా వంక చూస్తున్నాడు. చిన్నగా నవ్వుకుంటూ లోపలికి నడిచాను.

''సరితా ఏమిటి విశేషం! పెళ్లిచూపులంటే ఎప్పుడూ ముఖం మటమటలాడించుకుంటూ వస్తావు. ఇవ్వాళ నవ్వుతూ వస్తున్నావంటే ఈ సంబంధం తప్పక కుదురుతుంది''

అమ్మ సంతోషంగా నవ్వింది, నన్ను చూస్తూ మురిపెంగా.

''త్వరగా రెడీ అవ్వు. మంచం మీద చీర, జాకెట్టు పెట్టాను, కట్టుకో'' అమ్మ హడావుడిగా అంది లోపలికి వెళుతూ.

నాకీ పెళ్లి చూపులంటే – ఆ తతంగం అంటే అసహ్యం! ఏ చూపులకైనా కావల్సింది సొమ్ము చూపులే కాని సొగసు చూపులు కావు. బంగారు కాసులే కాని వాలుచూపులు కావు. ఓ సంతకెళ్లి గేదెను కొన్నట్టే. ''మాకేమిస్తారు? మా అబ్బాయికేం పెడతారు? మీ అమ్మాయికేం పెడతారు'' ఇదే తంతు. ఇవి నా ఆరో పెళ్లిచూపులు. అమ్మ తాపత్రయం, హడావుడి చూస్తుంటే కోపం వస్తుంది. అంతలోనే జాలి కలుగుతుంది, ఆవిడ మీద!

ఆవిడకెవరున్నారు నేను తప్ప. మా నాన్న ఎవరో నాకు తెలియదు. నా చిన్నప్పుడే అమ్మను వదిలేసి వేరే ఆవిడతో ఏలూరులో ఎక్కడో వున్నాడని నాకు చాలా పెద్దయ్యాక తెలుసుకున్నాను.

స్కూల్లో అందరూ వెక్కిరిస్తుంటే అమ్మను అడిగాను ''అమ్మా! నాన్నెక్కడ?'' అని.

మిషను కుట్టుకుంటున్న అమ్మ ఆశ్చర్యంగా నా వంక చూసింది. నే మళ్లీ రెట్టించేసరికి ఆవిడ కళ్లలోకి నీళ్లు గంగలు ఉరికాయి. గట్టిగా తుడిచేసుకుంటూ నవ్వేసి – ''సరితా! నీకు నాన్న లేడమ్మా! నేను నీకు అమ్మా, నాన్నా! సరేనా.''

నేను మళ్లీ ఏదో ప్రశ్నించబోయాను.

అమ్మ అడ్డొస్తూ – ''సరితా! నీకేం కావాలన్నా నేను తెచ్చిపెడతాను. కాని ఆ ఒక్కటిమటుకు నన్నడగకు. అదే మీ నాన్నను''.

అమ్మ గొంతు దుఃఖంతో పూడుకుపోయింది. నాకు ఏడుపొచ్చింది. అలాగే జాలిగా ఏడుస్తూ వుండిపోయాను.

''ఇంకెప్పుడూ నాన్నను అడగొద్దమ్మా!'' అంది మళ్లీ దీనంగా.

అంతే! అదే ఆఖరిసారి. నేను మళ్లీ ఎప్పుడూ అడగలేదు. అమ్మ నాకోసం చాలా కష్టపడింది. మిషను మీద బట్టలు కుట్టేది. అప్పడాలు, పచ్చళ్లు పెట్టి వీధిలో అందరికీ అమ్మేది. నాన్న మాకిచ్చిన ఆధారం ఒకే ఒక ఆధారం ఇల్లు! రెండు గదులు అద్దెకిచ్చి, ఒక్క గదిలో నేను అమ్మ గుట్టుగా గడిపాం. నా డిగ్రీ పూర్తయి ఉద్యోగంలో చేరడంతో ఇప్పుడు మాకు కొన్ని సమస్యలు తీరాయి. ఈ ఏడాది నేను సంపాదించినది, అమ్మ ముందు కొద్దిగా వెనకేసింది అంతా కలిపి నా పెళ్లి చేసేయాలన్న చింత ఆవిడకు పట్టుకుంది.

''సరితా! వచ్చేశారు'' అమ్మ కంగారుగా అంది.

బాబాయి, పిన్ని పెళ్లివాళ్ళను తీసుకురావడం చూసి నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే ఎన్నో ఏళ్లయింది వాళ్లు మా యింటికి వచ్చి. మా పిన్ని వచ్చి నన్ను తీసుకెళ్లింది హాలుకి. వాళ్ళు ఏవో ప్రశ్నలడిగారు. అలవాటయిన ఇంటర్వ్యూ. చిన్నగా చెప్పాను. అబ్బాయికేసి చూశాను మధ్యలో! బాగానే వున్నాడు. కొద్దిగా హైటు తక్కువనిపించింది మళ్లీ.

పెళ్లి వాళ్లు వెళ్లగానే అమ్మ, పిన్ని, బాబాయి చాలాసేపు మాట్లాడుకున్నారు. విషయం లీలగా అర్థమై నాకు కోపం ఆగలేదు. వాళ్లు వెళ్లిపోగానే అమ్మను పట్టుకుని కడిగేశాను.

''ఏంటమ్మా! ఇప్పటివరకు నువ్వు నేను ఒక్కటి! మరి పెళ్లి విషయం వచ్చేటప్పటికి ఎందుకు మారిపోతున్నావు. ఇన్నాళ్లు ఊళ్లో వున్నా మన ముఖం చూడని బాబాయి వాళ్లని పెద్దమనుషుల్ని చేసి పెళ్లి వాళ్ల ముందు కూర్చోబెట్టావు. ఎప్పుడో వదిలేసిన నాన్న దగ్గరకు బాబాయిని రాయబారం పంపుతున్నావు. ఏమిటీ అంతా నీ ఇష్టమేనా?''

''సరితా! నీకింకా చిన్నతనం. లోకం పోకడ నీకు తెలియదు. ఒదిగి వుంటేనే అది ముల్లులు పొడుస్తూ తన ఉనికిని గుర్తు చేస్తూ వుంటుంది. ఎదురు తిరిగితే అది కాకుల్లా పొడిచి మనకే ఉనికి లేకుండా చేసేస్తుంది. మొగుడు పక్కన లేని ఆడదానికి సమాజంలో ఎప్పుడూ సానుభూతి ఉండదమ్మా!''

అమ్మ ఆలోచనగా అంది.

''అంటే ఇన్నాళ్లు లేని నాన్నను ఇప్పుడు తీసుకువస్తే మనకు అందరు మెచ్చి మేక తోలు కప్పుతారా!'' కసిగా అన్నాను.

''కాదు, ముందు నీ పెళ్లి జరుగుతుంది'' అమ్మ మాటకు అదిరిపడ్డాను.

''అంటే!''

''పెళ్లివాళ్లు నువ్వు నచ్చావని సంబంధం ఒప్పుకున్నారు. కాని పెళ్లిలో నేను నాన్న కలిసి కన్నెధార పోయాలని కండిషను పెట్టారు. లేకపోతే వాళ్ల బంధువుల్లో వాళ్లకు పరువు తక్కువ కదా!'' అమ్మ నిర్లిప్తంగా అంది.

నాన్న రావడం అమ్మకీ ఇష్టం లేదు. నాకోసం, నా పెళ్లికోసం ఆవిడ ఎంతో రంపపు కోతకు గురవుతూ రాజీ పడుతోంది. నా మనసు అమ్మ పట్ల సానుభూతితో ఆర్ద్రమైంది. ఓదార్పుగా భుజం మీద చేయివేశాను.

అమ్మ నా గుండెల్లో తల దూర్చుకుని భోరుమని ఏడ్చేసింది.

''అమ్మా, ఏడవకు?''

కోపం, నిస్సహాయతను దుఃఖం డామినేట్ చేసింది.

అంతలోనే ఇంకో ఆలోచన ముల్లులా నన్ను పొడిచింది.

అయినా ఎవ్వరూ ఈ పెళ్లి నీకిష్టమేనా అని నన్నడగలేదు. మొగుడు వదిలేసిన దాని కూతురిగా వాళ్లు నన్ను చేసుకోవడానికి ఒప్పుకోవడమే మహా భాగ్యం అనుకున్నారేమో.


***

నాన్న వచ్చాడు – నా పెళ్లికోసం కాదు. నీడ కోసం. ముసలివాడయ్యాడు కదా. సంపాదించే ఓపిక లేదు. సంపాదించినదంతా ఉంచుకున్న వాళ్ల చేతిలో ముందే పోసేవాడు. నాన్న ఇప్పుడు వాళ్లకు వట్టిపోయిన గోవు. అందుకే మా యింటికి తోలేశారు – బాబాయి వెళ్లడమే తరువాయి. దేముడెంతటి పక్షపాతి. తానూ మగాడే కదా!

***

నా పెళ్లి నాన్న ఉండడంతో పరువుగా జరిగింది. మంగళసూత్ర ధారణ అప్పుడు నాకు సందుచివర అబ్బాయి అప్రయత్నంగా గుర్తుకు వచ్చాడు. ఎందుకో తెలియదు. లోపలి కన్నె ఊహల్లో ముద్రించుకున్న తొలి చిత్రమవ్వడం వల్లనేమో? అమ్మ సంతోషానికి పట్టపగ్గాలు లేవు. తాను పెంచిన




మొక్క పెద్దదై, పుష్పాలు పండ్లతో ఏపుగా కనిపిస్తున్న అనుభూతి ఆవిడ కళ్లలో ప్రతిఫలిస్తోంది.

కాపురానికి వెళ్లే ముందు – "అమ్మా! నాన్న ఇక్కడే వుంటాడా" అడిగాను.

అమ్మ నవ్వింది.

"నీ పెళ్లి చేయడానికి ఆయన అవసరం. నీ కాపురం కుదుటపడేవరకు కూడా ఆయన అవసరం లేదు కాని – ఆయన ఇల్లు ఇది! నా గురించేం నాకు బెంగ లేదు కాని నీ గురించే. అయినా కలిసి ఉండాలి తప్పదు!"

నా కళ్ళలో నీళ్లు తిరిగాయి. భూమి గుండ్రంగా తిరుగుతుంది. ఆడదాని ఆలోచనలన్నీ పిల్లల భవిష్యత్తు చుట్టూ పరిభ్రమిస్తాయి.

***

ప్రసాద్! మొగుడు రూపంలోని మానవ మృగం. లేని అలవాట్లు లేవు అతనికి. నా జీవితం నాశనమైపోయింది. అమ్మా, నేను ఇద్దరం శాపగ్రస్తులమా అనిపిస్తోంది ఆలోచిస్తుంటే.

"అమ్మా మనం పూర్తిగా మోసపోయాం! తాగుడు, జూదం, ఆడవాళ్లు – అన్ని అవలక్షణాలు వున్నాయి అతనిలో. ఇహ అతనిలో మార్పు రాదు" బావురుమన్నాను అమ్మ ఒళ్లో పడుకుని.

"మొగుడన్నాక అన్ని అలవాట్లు వుంటాయి. ఆడదే చూసీ చూడకుండా సర్దుకుపోవాలి" నాన్న వెటకారంగా నవ్వాడు అమ్మకేసి చూస్తూ.

నాన్న వంక అసహ్యంగా చూశాను. అమ్మ పోషణలో తేటతేరి నునుపుగా వున్నాడు. తన గూటికి చేరడం వల్ల మనిషిలో ఒకరకమైన గర్వం వచ్చింది. సొంత ఇల్లు, పుట్టి పెరిగిన ఊరు, స్నేహితులు, బంధువులు – ఇవన్నీ ఆయన్ని మళ్లీ రాజుని చేసి సింహాసనం ఎక్కించాయి. అమ్మ వంక చూశాను, పాపం అమ్మ కృంగిపోయింది. అప్పుడనిపించింది – నా దుఃఖాన్ని అమ్మ ఒడిలో పోద్దామని అలసిపోయి ఇంటికి వచ్చాను. కాని అమ్మ ఒడి నిండుగా ఉందని గ్రహించలేకపోయాను – వెర్రిదాన్ని! ఆడదాని జీవితం మగవాడు అనబడే రింగు మాస్టరు చేతిలో వుందని ఇప్పుడిప్పుడే అర్థం అవుతోంది.

***

ఇన్ని బాధల్లో నాకు ఉపశమనం ఒక్కటే! అదే నా ఉద్యోగం. మా ఆఫీసు స్టాఫు అందరూ చాలా మంచివాళ్లు! ఆఫీసు నుంచి నీరసంగా ఇల్లు చేరాను. 'ఈమధ్యన ఎప్పుడూ తల తిరుగుతోంది. డాక్టరుకు చూపించుకోవాలి ఒకసారి' అనుకుంటూ కాఫీ కలుపుకుని ఓపిక లేక సోఫాలో జారగిలపడ్డాను.

"సరితా"

కళ్లు విప్పాను. ప్రసాద్ పక్కన ఎవరో బజారు మనిషి! వెకిలిగా ఉంది. స్థాణువయ్యా్న!

"సరితా! రెండు ఆమ్లెట్లు, కాఫీ!" ప్రసాదు తూలుతూ ఆమెతో బెడ్‌రూమ్‌లోకి వెళ్లిపోయాడు.

ఆపాదమస్తకం కోపంతో అవమానంతో వణికిపోయాను. లోపల్నుంచి నవ్వులు, గుసగుసలు – నా మనసును అగ్నిలా మండించేస్తున్నాయి. తెలియని తెగింపుతో తలుపు దడాల్న తోసుకుని లోపలికి వెళ్లాను.

మంచం మీద ముద్దుల్లో ఒకరి మీద ఒకరు.

ఆవేశం పెల్లుబికింది.

"ఏమిటండి ఇది. ఇంత ఘోరం. ముందు ఆమెను బయటకు పంపండి!"

"నువ్వెవరు నాకు చెప్పడానికి!"

"ఎవరో తెలియకుండానే పెళ్లి చేసుకున్నారా!"

"బాగా తెలిసే చేసుకున్నాను! మొగుడు వదిలేసిన దాని కూతురివి, నువ్వు మీ అమ్మా కలిసి ఎన్ని నాటకాలు ఇలాంటివి ఆడారో, ఎంత సంపాదించారో నాకు తెలియదనుకున్నావా? పెద్ద పతివ్రత ఫోజులు! మీ అబ్బే లేకుండా, మీ అమ్మ నిన్నెలా పెంచిందే? ఏరికోరి చేసుకుంటే, ఇలాంటివన్నీ నువ్వు అలవాటుపడినదానివే కదా అని! అర్థమైందా, పో!"

"ఒరేయ్ ఏం కూశావురా" ఆవేశంగా మీదకెళ్లి చొక్కా పట్టుకుని ఊపేశాను పిచ్చిదానిలా.

"ఫో! ఫోవే" ఈడ్చిపెట్టి చెంప మీద ఒక్క దెబ్బ కొట్టి నెట్టేశాడు. ఆ విసురుకు నేవెళ్లి పక్కనే వున్న అద్దానికి కొట్టుకోవడంతో రక్తం ధారగా కారుతుంటే నేలకొరిగి స్పృహతప్పి పడిపోయాను.

***

మళ్లీ కళ్లు తెరిచేటప్పటికి హాస్పిటల్లో వున్నాను. అమ్మ మసక మసకగా కనపడుతోంది. పక్కనే ఎవరో తెలిసిన ముఖంలా వుంది. ఎవరో! మళ్లీ మగతలోకి జారిపోయాను. రాత్రివేళ మళ్లీ కొద్దిగా నెప్పి అనిపించి మెలకువ వచ్చింది. నర్సు అప్పుడే ఇంజక్షనిచ్చి వెళ్తోంది. పక్కకి చూస్తే అమ్మ లేదు. ఆ అబ్బాయి – సందుచివర దిగబెట్టే అబ్బాయి పక్కన కుర్చీలో వున్నాడు. ఆశ్చర్యపోయాను. దాహం వేస్తోంది.

"మీరు, ఇక్కడ. అమ్మ ఏది?" తల దిమ్ముగా వుంది, అలాగే అడిగాను. లేవబోతూ.

"మీరు లేవకండి" రెండు టాబ్లెట్లు తీసుకుని వచ్చి మంచినీళ్లు అందించాడు.

"నా పేరు మధు. ఇక్కడ హాస్పిటల్లో రిసెప్షన్‌లో పనిచేస్తున్నాను. మీ అమ్మగారు ఇంటికి వెళ్లారు ఇప్పుడే!"

అంతా కలలాగా వుంది. తలంతా నెప్పిగా వుంది. ప్రసాదు ఎంత దుర్మార్గుడు? నా జీవితం ఎందుకిలా అయిపోయింది ఆలోచిస్తూ అలాగే నిద్రలోకి జారిపోయినా ఉలిక్కిపడుతూనే వున్నాను.

నాలుగు రోజులకు తేరుకున్నాక అమ్మ చెప్పిన విషయాలు నన్నింకా ఆశ్చర్యపరిచాయి.

నేను రక్తపు మడుగులో పడివుండడం చూసి

ప్రసాదు పరారైపోయాడు. చుట్టుపక్కల వాళ్లు పోలీసులకు కంప్లయింట్ ఇచ్చి హాస్పిటల్‌లో చేర్చారట.

''మధు, ఈ అబ్బాయి మనకెంతో సాయం చేశాడు ఇన్నాళ్లు. ఇది పోలీసు కేసయింది. నాన్న మా అత్తారింటికిపోయాడు. నువ్వే పొరపాటున పడిపోయావని చెబితే కేసు కొట్టేస్తారట. ప్రసాదు బయటపడతాడు!'' నా భవిష్యత్తు గురించిన ఆందోళనలో అమ్మ గొంతు వణికింది..

నాకో కోపం రాలేదు. ఏడుపు రాలేదు. అసహ్యం వేసింది - నాన్న మీద, ప్రసాదు మీద, మొత్తం మగజాతి మీద!

***

ఆఫీసు వాళ్ళు, మధు సాయంతో నేను కోర్టుకు వెళ్లాను తెగించి. విడాకులు మంజూరు కావడంతో పాటు నా కట్నం డబ్బు తిరిగి వచ్చింది, ప్రసాదుకు జైలుశిక్ష పడింది.

అమ్మ ఓపక్క నాన్న వేధింపులతో, మరోపక్క నా జీవితం మీద బెంగతో కృంగిపోయింది.

నెమ్మదిగా మళ్లీ జీవితం గాడిలో పడింది. ఓరోజు ఆఫీసునుంచి వస్తుంటే మధు బస్టాపులో కనపడ్డాడు.

''నేను మీతో మాట్లాడాలి'' నేనేం ఆశ్చర్యపడలేదు. ఈమధ్యన అన్నింటికీ మనస్సు ఒకలాగే స్పందిస్తోంది.

''నేను మిమ్మల్ని చాలాకాలం నుంచి ప్రేమిస్తున్నాను'' సూటిగా విషయంలోకి వచ్చేశాడతను.

కళ్లెత్తి చూశాను - నిర్మలంగా వున్నాయి అతని కళ్లు.

''నాకు తల్లిదండ్రులు చిన్నతనంలోనే పోయారు. మా మావయ్య కూతుర్నిచ్చి చెయ్యాలన్న ఆశతో చదివించాడు. ఉద్యోగం రాక, ధైర్యం చాలక మీ పట్ల నా ప్రేమను మనసులోనే దాచుకున్నాను ఇన్నాళ్లు! ఇప్పుడు మీ పరిస్థితి చూసి జాలితో కాదు, గుండెల్లో ఒదిగి వున్న ప్రేమతో ఆరాధనతో అర్థిస్తున్నాను. ప్లీజ్! మీకు తోడుగా ఉంటాను. మిమ్మల్ని పెళ్లి చేసుకుంటాను!''

కదిలిపోయాను! మనసు పొరల్లో అలజడి!!

చెమ్మగిల్లిన కళ్లతో - ''మధూ! యూ ఆర్ టూ లేట్! మనం కలిసి ఎక్కాల్సిన రైలు వెళ్ళిపోయింది. మళ్లీ ప్రయాణం చేయాలన్న ఆలోచన, ఆసక్తి నాకు లేదు. వైజాగ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు వచ్చాయి. రేపు ఫస్టుకి జాయిన్ అవ్వాలి!''

మధు హతాశుడయ్యాడు.

''సరితా! ఇంకొక్కసారి ఆలోచించండి'' అపరిమితమైన బాధ అతని గొంతులో ధ్వనించింది.

''మధూ! మగవాళ్ల మీద ద్వేషం పెంచుకుంటున్న సమయంలో మీలాంటి ప్రేమమూర్తులు ఉంటారని ఋజువు చేశావు. నేను పడ్డ బాధ, మీ మావయ్య కూతురు పడకూడదు. ఆ అమ్మాయిని చేసుకో! మీరు సుఖంగా ఉండాలి. నా ఎడారి జీవితంలో స్నేహం ఓ ఒయాసిస్సు! ఎప్పుడైనా అలిసినప్పుడు మీ ఇంటికి వస్తాను, మీ స్నేహంలో దప్పిక తీర్చుకోడానికి! అది చాలు.''

''మరొక్కసారి!'' మధు చెప్పబోయాడు. నేను చెప్పనివ్వలేదు. ప్రేమకు అనంతమైన ఆనందాన్ని ఇవ్వడమే కాదు, అత్యంత విషాదాన్ని ఇవ్వడమే కాదు, అత్యంత విషాదాన్ని పంచడం తెలుసు.

ఇల్లు చేరేటప్పటికి నాన్న అమ్మ మీద అరుస్తూ చేయెత్తుతున్నాడు.

చెంప చెళ్లుమనిపించి, ఒక్క తోపు తోశాను ఆయన్ను! దిమ్మెరపోయి మూలకు వెళ్లి పడ్డాడు. అమ్మ కోపంగా, ఆశ్చర్యంగా చూసింది నావంక!

''అమ్మా! ఇంక చాలమ్మా ఈ డ్రామాలు! ఇంత కాలం మనం చచ్చామో బతికామో పట్టించుకోని ఈయనెందుకు ఇప్పుడీ పెత్తనాలు! వద్దమ్మా! ఈయనెవరు అసలు?''

''ఎంత ధైర్యమే! ముందు నడు బయటకు, ఇది నా ఇల్లు. నా ఇంట్లో నన్నే కొడతావా'' నాన్న అరుస్తున్నాడు మూలుగుతూనే.

''నీ ఇల్లయితే ఉరేసుకుని ఇందులోనే చావు. అమ్మా మనం కొనుక్కున్న సామాన్లు సర్దు! మనం వైజాగ్ వెళ్లిపోతున్నాం!''

ఊహించని ఈ పరిణామానికి నాన్న కంగుతిన్నాడు.

''మీ అమ్మేం రాదు'' కోపంగా అరిచాడు.

అమ్మ ''నేను వెళుతున్నాను'' నిశ్చలంగా అంది.

నాన్న కళ్లలో భయం, దిగులు కనిపించాయి. ఆడది ఎదురుతిరిగితే మగాడికి లైఫేముంటుంది?

***

మధు కన్నీళ్లతో వీడ్కోలు చెప్పాడు. అంతవరకు నిగ్రహంగా వున్న నేను ట్రైను కదిలాక అమ్మ ఒడిలో పడుకుని వెక్కివెక్కి ఏడ్చాను.

''సరితా! మధుకి కొంచెం ఆలోచించి చెబుతానని చెప్పాల్సింది!'' అంది అమ్మ అస్పష్టంగా.

''అమ్మా! నా పెళ్లి జరుగుతుంటే సెటిల్ కాలేదంటూ ప్రేక్షకుడిలా చూస్తుండిపోయాడతను! రేపు మావయ్య, కూతురు వచ్చి, నిన్ను పెంచాం, ప్రేమించాం అంటే వెళ్లిపోడన్న గ్యారంటీ లేదు. అసలు నా పెళ్లి, విడాకులతో నేను కొంచెం పాజిటివ్‌గా ఆలోచించడం మానేశాను. అయినా ఓ చాన్సు తీసుకుందామన్నా ఆలస్యమైపోయిందమ్మా! నాకిప్పుడు నాలుగో నెల!'' దుఃఖంతో గొంతు వణికింది.

అమ్మ కళ్లలో ఆశ్చర్యం.

నాలోని వేదన అర్థం చేసుకున్నట్టుగా అమ్మ ఓదార్పుగా నన్ను దగ్గరగా పొదువుకుంది.

''అమ్మా! ముందే దీపాన్ని చిదిమేద్దాం అనుకున్నాను. కాని డబ్బు, తోడు ఏం లేకపోయినా నువ్వు నన్ను పెంచలేదా! మరి అన్నీ వున్న నేనెందుకు అలా చేయాలి! పాపయినా బాబయినా ఒక్కలాగే పెంచుతానమ్మా! వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేలా పెంచుతా.''

నా జీవితానికి గమ్యం వుందంటూ రైలు ముందుకు దూసుకెళుతోంది చీకట్లో. ఆకాశంలో ఒంటరిగా చిన్న నక్షత్రం మిలమిలా మెరుస్తోంది.

★


కాస్మటిక్ దంత వైద్యం



చికిత్సకు ముందు    చికిత్స తరువాత

''నవ్వితే వికారంగా కనిపించే చిగుర్లు, వంకర పళ్ళతో ఎంత నరకం అనుభవించానో! పత్రికల్లో చదివి 'స్మైల్ డిజైనింగ్' చేయించుకున్నా. చూడండి కేవలం మూడు సిటింగుల్లో నన్ను ఎంత అందంగా మార్చేశారో!!

పార్థ దంతవైద్యశాల & రీసర్చి సెంటర్

తిరుపతి : ఆర్.టి.సి. బస్టాండ్ వెనుక, శ్రీనివాసం కాంప్లెక్స్ ఎదురుగా, ఫోన్: 0877-2250105

హైదరాబాదు: స్కైల్ స్క్రీం కాంప్లెక్స్, లిబర్టీ సెంటర్, టి.టి.డి. కళ్యాణ మండపం ప్రక్కన, హిమాయత్ నగర్, ఫోన్: 040-23222200

రీఎంబర్సమెంటు కొరకు రాష్ట్ర ప్రభుత్వం మరియు సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్, ఎ.పి. వారిచే గుర్తింపబడిన దంతవైద్యశాల